

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ నాయకులు

## ప్రతి ఇంటిపైనా తిరంగా జెండా ఎగరాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- కరీం'నగరం'లో హర్ ఘర్ తిరంగా యాత్ర

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 12: 'ప్రతి ఇంటిపై తిరంగా జెండా ఎగరేయాలి. జాతీయ వాద భావజాలంతో పని చేయాలి' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్నారు. తెలంగాణ చౌక్ నుంచి టవర్‌సర్కిల్ వరకు పాదయాత్రగా వెళ్లారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం టవర్ సర్కిల్లో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, నెహ్రూలపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ రాహుల్ గాంధీ చైనా ఆలోచనలను అమలు చేసే వ్యక్తని, చైనా ఆదేశాలతోనే బంగ్లాదేశ్ ఘటనపై ఆయన నోరు విప్పడం లేదని ధ్వజమెత్తారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ అని, అలాగే ఎందరో మహనీయులు దేశం కోసం బలిదానం చేశారని గుర్తు చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ నేతలు మాత్రం నెహ్రూ కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా చరిత్రను తెరమరుగు చేసే కుట్రలు చేశారని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తు చేసేందుకే మోదీ ఆదేశాల మేరకు ప్రతి ఏటా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం, సెమినార్లు నిర్వహించడం, దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పుష్పార్చన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు గండ్ర నళిని పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం

- సుందర నగరంగా మార్చాం
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 12 : గడిచిన పదేళ్లలో కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. సోమవారం 6వ డివిజన్‌లోని పాతబజార్ ప్రాంతంలో రూ.27 లక్షలతో చేపట్టే ఎస్‌డబ్ల్యూ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలు పరిష్కరించామని గుర్తు చేశారు. పెండింగ్ పనులేమైనా ఉంటే వాటిని దశల వారీగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో వచ్చిన నిధులతో నగర రూపురేఖలు మార్చి సుందరంగా మార్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు కోల మాలతి సంపత్, నాంపల్లి శ్రీనివాస్, నక్క పద్మ కృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కేవైసీ అప్‌డేషన్ చేసుకోవాలి

పీఏసీఎస్ సభ్యులకు కేడీసీసీబీ అధికారుల సూచన




కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 12 : ది కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ పరిధిలోని 128 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సభ్యులందరూ కేవైసీ వివరాలను తప్పనిసరిగా డిజిటలైజేషన్ చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో గల కేడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న సంఘంలోని సభ్యులు కేవైసీ వివరాలను ఆయా సంఘాల్లో కంప్యూటరైజేషన్ జరుగుతున్నందున నమోదు చేసుకోవాలన్నారు. సంఘంలో సభ్యత్వం తీసుకుని ఇప్పటి వరకు లావాదేవీలు జరపని సభ్యులు తన సభ్యత్వం కొనసాగాలంటే తమ రికార్డులను వెంటనే డిజిటలైజేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆధార్‌కార్డు, పాన్ కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సంఘంలో సంప్రదించాలని సూచించారు.

# విద్యార్థుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

అనిరుధ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



- అనిరుధ్ తల్లిలాంటి బాధ మరొకరికి రానీయొద్దు
- గురుకులాల్లో అపరిశుభ్రతను తొలగించాలి
- పాములు, తేళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలి
- ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో కమిటీ వేస్తాం
- నాలుగైదు రోజుల్లో హాస్టళ్లను సందర్శిస్తాం
- రాజకీయాలక్కర్లేదు.. మానవీయంగా స్పందించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- బొప్పాపూర్‌లో విద్యార్థి కుటుంబానికి పరామర్శ



బొప్పాపూర్‌లో అనిరుధ్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: గురుకులాలు అపరిశుభ్రంగా మారిపోయాయని, విద్యార్థుల మృతికి ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. గురుకులాలను క్లీన్‌గా ఉంచాలని, పాములు, తేళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లుల కడుపుకోతకు ప్రభుత్వం కారణమవుతున్నదని ఆగ్రహించారు. గురుకులాల్లో విద్యార్థుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి అనిరుధ్ మృతిచెందగా, బాలుడి అమ్మమ్మ ఇంట్లో ఉన్న తల్లిదండ్రులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటానని భరోసానిచ్చారు. ₹50వేలు ఆర్థిక సాయం చేశారు. బాలుడి తల్లి ప్రియాంక బాధ మరో తల్లికి రానీయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. పెద్దాపూర్ గురుకులంలో అపరిశుభ్ర వాతావరణంతో ఒకరు కాదు ఇద్దరు విద్యార్థులు మృతిచెందడం, పలువురి పరిస్థితి విషమంగా మారడం బాధాకరమన్నారు. కొంత కాలంగా సంక్షేమ హాస్టళ్లలో ఆలనాపాలనా చూసుకునే నాథుడే లేకుండా పోయారనే నిజాన్ని తెలుసుకోవాలని సూచించారు. గడిచిన ఎనిమిది నెలల్లోనే గురుకులాల్లో పలు కారణాలతో 36 మంది పిల్లలు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. భువనగిరిలో, సూర్యాపేటలో ఆత్మహత్యలు, మృతి జరిగాయని, పాముకాటుతో, కల్తీ ఆహారం లాంటి సంఘటనలు జరగడం తరచూ చూస్తున్నామన్నారు.

### నాలాంటి బాధ మరో తల్లికి రావద్దు

**- అనిరుధ్ తల్లి ప్రియాంక**

'తమ కొడుకు హాస్టల్ సిబ్బంది కన్నోళ్లలా చూసుకుంటరనుకుంటే చివరకు కడుపుకోత మిగిల్చిన్రు' అని అనిరుధ్ తల్లి ప్రియాంక కన్నీటి పర్యంతమైంది. మాజీ మంత్రి కేటీఆర్ ఎదుట తన కొడుకును తలుచుకుంటూ గుండెలు బాధుకొని ఏడ్చింది. తన కొడుకు ఇంటికి వచ్చి వెళ్లిన మూడు రోజులకే మృతిచెందాడని, తన కడుపుకోత మరొక తల్లికి రాకుండా చూడాలని చెప్పింది.

మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి, వారి కుటుంబంలో ఒకరి ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురుకులాల్లో విషాహారం, కల్తీ ఆహారం తినడం వల్ల 500 మంది విద్యార్థులను హాస్పిటల్‌లో చేర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. దుర్ఘటన జరిగితే ప్రభుత్వం మానవతా హృదయంతో స్పందించాలని, అందులో రాజకీయాలు అవసరం లేదని సూచించారు. ఇది వరకు బాసరలో జరిగినప్పుడు తాము కూడా వెళ్లి వారితో మాట్లాడి భోజనం చేసి వారికి భరోసానిచ్చే ప్రయత్నం చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేద పిల్లలు బాగుండాలని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేశారని, వాటిని జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసి కేజీ టు పీజీ విద్యకు శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అనిరుధ్ తల్లి ప్రియాంక తనతో అన్నమాటను గుర్తు చేస్తూ మరో తల్లికి కడుపుకోత ఉండకుండా చూసేందుకు తన ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. పాఠశాలలను అధికారులు దత్తత తీసుకోవాలని, అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీ చేస్తే సిబ్బంది క్రమశిక్షణతో పనిచేస్తారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 6.5 లక్షల మంది పిల్లలకు ప్రభుత్వమే తల్లిదండ్రిలా ఉండాలని ముఖ్యమంత్రిని, చీఫ్ సెక్రటరీని కోరుతున్నామని చెప్పారు. సిరిసిల్ల నియోజకవర్గంలో, జిల్లాలో జరిగే ఇలాంటి దురదృష్ట సంఘటనలపై ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు, అధికారులకు ముందస్తు, సమాచారం ఇవ్వాలని, పత్రికా విలేకరులను కోరారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ ఎంపీటీసీ ఇల్లెందుల గీతాంజలి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, డైరెక్టర్ ల్యాగల సతీశ్‌రెడ్డి, నాయకులు అందె సుభాష్, బొమ్మనవేణి సత్యం ఉన్నారు.

### కడుపుకోత మిగల్చవద్దు

గురుకులాల్లో విద్యార్థుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. పిల్లల తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చొద్దు. పాముకాటుతో చనిపోయిన అనిరుధ్‌లాంటి పరిస్థితి ఏతల్లికి రాకుడదు. ఈ విషయంలో ప్రభుత్వం రాజకీయ బేషజాలకు పోవద్దు. రాష్ట్రంలోని గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనుభవం ఉన్న నాయకుడు, గతంలో గురుకులాల సెక్రటరీగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ వేస్తాం. నాలుగైదు రోజుల్లో కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 20, 30 సంక్షేమ గురుకులాలను పరిశీలిస్తుంది. ఆయా స్కూళ్లలో లోటుపాట్లను గుర్తించి ప్రభుత్వానికి నిష్పక్షపాతంగా, నిర్మాణాత్మక సూచనలు చేస్తాం. అందులో ఎలాంటి రాజకీయం లేదు.

**- కేటీఆర్**

## కస్టమర్‌కేరని ఫోన్ చేస్తే ₹లక్షా 50వేలు మాయం

జమ్మికుంట, ఆగస్టు12: ఆన్‌లైన్ లావాదేవీల్లో ఓ వినియోగదారుడు మోసపోయాడు. గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ వెతికి ఫోన్ చేసి నిండా మునిగాడు. అడిగిన వివరాలన్నీ చెప్పి దాదాపు ₹లక్షా 50వేలు నష్టపోయాడు. జమ్మికుంట పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పంజాల తిరుపతి తన ఫ్రెండ్‌కు ఆంధ్రాబ్యాంకు (యూనియన్ బ్యాంకు) ఖాతా నుంచి కొంత డబ్బును ఫోన్ పే ద్వారా పంపించాడు. అయితే ఆ డబ్బు ట్రాంజాక్షన్ కాకపోవడంతో ఆందోళన చెందాడు. ఆంధ్రాబ్యాంకు కస్టమర్‌కేర్‌కు సంబంధించిన నంబర్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. అందులో ఓ నంబర్ తెలుసుకుని ఫోన్ చేశాడు. కస్టమర్ కేర్ నుంచి మాట్లాడిన వారు అడిగిన వివరాలన్నీ తిరుపతి చెప్పాడు. తర్వాత తన ఖాతా నుంచి ₹లక్షా 40వేల 999 కట్ అవడంతో లబోదిబోమన్నాడు. ఇది సైబర్ మోసమని గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ రవి కేసు నమోదు చేశారు.

# పేదోళ్లకు న్యాయం చేయరా..?

### గోడు వినేదెవరు?

- ప్రజావాణికి వెల్లువలా అర్జీలు
- పరిష్కారం కోసం బాధితుల ఎదురు చూపులు

ప్రజావాణికి అర్జీలు వెల్లువెత్తుతున్నాయి.. ఏ జిల్లాలో చూసినా పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి.. అయితే పరిష్కారంలో జాప్యంతో ఎదురుచూపులే మిగులుతున్నాయి. ప్రతి సోమవారం అర్జీలు పెట్టుకోడం, పరిష్కారం ఆలస్యం అవుతుండడంతో అర్జీదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు అప్పుడూ ఇప్పుడూ అంటూ కాలయాపన చేస్తుండడంతో తిరిగీ తిరిగీ వేసారిపోతున్నారు. ఒక సమస్య పరిష్కారం కోసం ఎన్నిసార్లు అర్జీలు ఇవ్వాలని వాపోతున్నారు. పేదోళ్లకు న్యాయం చేయని అధికారులు ఉండెందుకని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రభుత్వం ఏం పాలన చేస్తున్నదని నిలదీస్తున్నారు.

**- కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 12**



- అధికారులు ఉండెందుకు?
- ప్రభుత్వం ఏం పాలన చేస్తున్నట్టు?
- ఇంకెన్నిసార్లు ప్రజావాణిలో అర్జీ ఇవ్వాలి
- వాపోయిన అర్జీదారుడు ఒగ్గు రాజమల్లు
- ఎవరూ న్యాయం చేయడం లేదని ఆవేదన

నాది సర్వారెడ్డిపల్లి. మా తండ్రి నుంచి నాకు వారసత్వంగా రావాల్సిన భూమిలో 27 గుంటలు ఇతరుల పాసుబుక్కులో నమోదైంది. దీనిపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన. ఎవరూ పట్టించుకోలేదు. ఇదేంటని అడిగితే నన్నే బెదిరిస్తున్నరు. ఇప్పటికీ మూడు సార్లు ప్రజావాణిలో అర్జీ ఇచ్చిన. పోయిన నెల 8వ తారీఖున ప్రజావాణికి నేను, నాభార్య పురుగుల మందు డబ్బాతో వచ్చినం. అధికారులు గమనించి, తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన్రు. నెల దాటింది. ఇప్పటివరకు మాకు ఎలాంటి న్యాయం జరుగలే. దీనిపై డీఆర్వోను అడిగితే, తహసీల్దార్‌ను అడుగాలంటున్నడు. మాలాంటి పేదోళ్లకు న్యాయం చేయని అధికారులు ఉండెందుకు? డ్యూటీలు చేసుడెందుకు? పురుగుల మందు తాగుతమన్నా కూడా వారిలో మార్పు లేదు. ప్రభుత్వం ఏం పాలన చేస్తున్నట్టు?

**- ఒగ్గు రాజమల్లు, సర్వారెడ్డిపల్లి (గంగాధర)**



### రుణమాఫీ ఎందుకు కాలేదు

నాకు దుర్శేడ్‌లో మూడెకరాలు ఆరుగుంటల ఎవుసపు భూమి ఉన్నది. నేను చాలా ఏండ్ల సంది రుణం తీసుకుంటున్న. తిరిగి చెల్లిస్తున్న. ఏడాది కింద ₹1.30లక్షల వ్యవసాయ రుణం తీసుకున్న. సర్కారు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే సంబురపడ్డ. కానీ, మాకు మాత్రం రుణమాఫీ కాలే. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాకు రుణమాఫీ అయింది. ఇప్పుడెందుకు కాలేదో అధికారులే చెప్పాలే. మూడో విడతలోనైనా రుణమాఫీ చేయాలే.

**- ఆలేటి లక్ష్మి, దుర్శేడ్ (కరీంనగర్ రూరల్ మండలం)**

### డయాగ్నొస్టిక్ సెంటర్లపై కొరడా ఝులిపించాలి

కరీంనగర్ జిల్లాకేంద్రంలో ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్ల సిండికేట్ అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నది. గతంలో కంటే 30శాతానికి పైగా ధరలు పెంచిన్రు. తమ వద్దకు పంపే వైద్యులు, ఇతరులకు కమీషన్లు ఇస్తున్రు. పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఈ సెంటర్ల దోపిడీతో అనేక బాధలు పడుతున్రు. దీనిపై ఇప్పటికే పలుసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినం. అయినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా వెంటనే స్పందించాలి. సిండికేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలపై కొరడా ఝులిపించాలి. దోపిడీకి అడ్డుకట్ట వేయాలి. **- గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్, సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**

## దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా సుప్రియ



కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఆగస్టు 12 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్ నాయిని సుప్రియకు అసిస్టెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ హనుమంతరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లాకు బదిలీకాగా, ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఈ క్రమంలో ఇక్కడే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుప్రియకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 12 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో ఆదివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. కరీంనగర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు పలు ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అండర్-12, 15, పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పోటీల నిర్వహణకు సహకరించిన వైద్యులు వినయ్ కుమార్ (సూర్య చెస్ట్ క్లినిక్), సుమన్, దిలీప్, వెంకన్న (వజ్ర హాస్పిటల్), వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దేవునూరి సతీశ్ బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను విజయవంతం చేసిన పలు జిల్లాల క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులను కరీంనగర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీ శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సర్దార్ సురేందర్‌సింగ్, ట్రెజరర్ గౌతంరెడ్డి, జాయింట్ సెక్రటరీ వికాస్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇక రోడ్లపైకి ఈవీ బస్సులు




ఎలక్ట్రిక్ బస్సు

- కరీంనగర్ రీజియన్‌కు 70 కేటాయింపు
- వర్క్‌షాపులోకి వచ్చిన 35 బస్సులు.. త్వరలో మిగతావి

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 12 : ఇక రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు రయ్.. రయ్‌మని దూసుకెళ్లనున్నాయి. డీజిల్ వ్యయాన్ని తగ్గించుకోవాలనే లక్ష్యంతో ఆర్టీసీ పర్యావరణ హితమైన ఎలక్ట్రికల్ బస్సుల వైపు అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే కాగా, రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి బస్సులను కొనుగోలు చేసింది. ప్రతి రీజియన్‌లో ప్రయాణికుల రద్దీని బట్టి కేటాయించింది. కరీంనగర్ రీజియన్‌కు వంద బస్సులు అవసరం ఉంటాయని ఉన్నతాధికారులు నివేదిక పంపించగా, కొత్తగా కొనగోలు చేసిన ఎలక్ట్రికల్ బస్సుల్లో ప్రస్తుతం 70 సూపర్ లగ్జరీ బస్సులను కేటాయించారు. అందులో 35 కరీంనగర్ జోనల్ వర్క్ షాపునకు వారం కిందటే చేరుకోగా, ఇప్పటికే బస్సుల చార్జింగ్ కోసం డిపో -2 లో 14 పాయింట్లతో స్టేషన్ ఏర్పాటు చేశారు.

### మూడు గంటల చార్జింగ్‌తో 350 కిలోమీటర్లు

బస్సు బ్యాటరీ ఫుల్ చార్జింగ్ కోసం మూడు గంటల సమయం పట్టనున్నది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్లు నడుస్తుందని అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకున్నారు. బస్సుల నిర్వహణ అద్దె ప్రాతిపదికన (జిసీసీ-గ్రాస్‌కాస్ట్ కాంట్రాక్ట్) పద్ధతిన జేబీఎం(జై భారత్ మారుతి) సంస్థకు అప్పగించారు. బస్సులో కండక్టర్, ఆర్టీసీ సిబ్బంది ఉండనున్నారు. పర్యవేక్షణ ఆపరేషన్స్ మాత్రమే ఆర్టీసీ చూసుకుంటుంది. డ్రైవర్, రిపేర్స్ జేబీఎం సంస్థ నిర్వహిస్తుంది. ఇప్పటికే ప్రైవేట్ డ్రైవర్లను ఎంపిక చేయడమే కాకుండా వారందరికీ సంస్థ శిక్షణ కూడా ఇస్తున్నది. ప్రస్తుత కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో 33 బస్సులను కరీంనగర్ -జేబీఎస్ నడిపించనున్నారు. 2 బస్సులు స్పేర్‌లో ఉంచారు. మిగతావి వచ్చిన తర్వాత కరీంనగర్-జేబీఎస్, కరీంనగర్-గోదావరిఖని, కరీంనగర్-కామారెడ్డి, కరీంనగర్-జగిత్యాల, కరీంనగర్-సిరిసిల్ల రూట్లకు కేటాయించనున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ నెలలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.



డిపో-2లో 14 పాయింట్లతో చార్జింగ్ స్టేషన్

### త్వరలోనే ప్రారంభిస్తాం

రీజియన్‌కు కేటాయించిన ఎలక్ట్రికల్ బస్సులు వర్క్‌షాపులకు చేరుకున్నాయి.70 బస్సులకు 35 మొదటి దశలో వచ్చాయి. అందులో రెండు బస్సులను స్పేర్‌లో ఉంచాం. మిగతా 33 బస్సులను కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు నడిపిస్తాం. బస్సుల చార్జింగ్ కోసం డిపో-2లో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటైంది. రెండో దశలో రానున్న 35 బస్సులను హైదరాబాద్‌తో పాటు రీజియన్‌లో ఇతర ప్రాంతాలకు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. పర్యావరణ హిత మైన ఎలక్ట్రికల్ బస్సుల వల్ల డీజిల్ ఆదా అవుతుంది. పర్యావరణ రక్షణకు తోహదపడుతుంది.

**- సుచరిత, రీజియన్ మేనేజర్ (కరీంనగర్)**

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571